అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా

- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు
- దళారులు, నాయకులకు అందుబాటులో ఇసుక

వెల్దుర్తి, డిసెంబర్ 18: వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పరిధిలోని హల్దీవాగు నుంచి రాత్రి వేళల్లో ఇసుక అడ్డగోలుగా అక్రమ రవాణా జరుగుతున్నది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో అడ్డూఅదుపు లేకుండా రాత్రి 9 నుంచి ఉదయం ఏడు గంటల వరకు నిరంతరాయంగా ఇసుకను తరలిస్తున్నారు. వాగు వెంబడి ఉన్న గ్రామాల్లో పేదలు ఇండ్లు నిర్మించుకోవడానికి మాత్రం ఇసుక దొరకదు. మరీ రాత్రి వేళల్లో తరలిస్తున్న ఇసుక ఎక్కడికి వెళ్తుందంటే గ్రామాల శివారులోని ఖాళీ స్థలాలు, కోళ్ల ఫారాల వద్ద డంపులు పోసి, టిప్పర్ల ద్వారా నగరాలకు తరలిస్తున్నారు. ఇతర గ్రామాలు, మండలాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దళారులు, నాయకులు కావాలంటే సమయం సందర్భం లేకుండా ఎప్పుడంటే అప్పుడు ఇసుక అందుబాటులో ఉంటుంది. దీంతో వాగు పరీవాహక గ్రామాల్లో కొందామంటే ఇసుక దొరకడం లేదని, ఇతర గ్రామాలు, మండలాల ప్రజలకు మాత్రం హల్దీవాగు ఇసుకను సులభంగా లభించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వాగు వెంబడి ఉన్న మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లి, అచ్చంపేట, హక్కింపేటతో పాటు వెల్దుర్తి మండలంలోని

నెల్లూర్ శివారు హల్దీవాగులో ఇసుక తవ్వడంతో ఏర్పడిన గోతులు

వెల్దుర్తి శివారులోని హల్దీవాగులో ఇసుక గోతులు

హస్తాల్‌పూర్, నెల్లూర్, వెల్దుర్తి గ్రామాల నుంచి రాత్రి వేళల్లో ఇసుక అక్రమంగా రవాణా జరుగుతున్నది. దూరాన్ని బట్టి ధరలు పలుకుతుండడంతో ఇసుక అక్రమ రవాణాదారులు ఆయా ప్రాంతాల పరిధిలోని క్షేత్రస్థాయిలో ఉండే అధికారులను మచ్చిక చేసుకుంటున్నారు. దీంతో ఇసుకను అక్రమంగా, యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు.

అధికారుల రూటే సెపరేటు

వెల్దుర్తి మండల అధికారుల రూటే సెపరేటు' కావడం గమనార్హం. అధికారులు సూచించిన రోజుల్లో, శని, ఆదివారాలతో పాటు సెలవు ముందు రోజుల్లో మాత్రమే ఇసుక రవాణా జరుగుతుంది. అంటే అధికారుల మాటకు దళారులు ఎంత కట్టుబడి ఉన్నారో అర్థం అవుతున్నది. దీనికి గాను సంబంధిత అధికారులకు, సిబ్బందికి రోజు, ట్రిప్పుల వారీగా మామూళ్లు అందుతున్నాయని ఆరోపణలున్నాయి. ఒక్కో రోజు సుమారు యాభై మంది కూలీలను ఏర్పాటు చేసి ముప్పై నుంచి నలభై ట్రిప్పుల వరకు రవాణా చేయడం, ఉదయం వేళల్లో జేసీబీలతో వాగులో కుప్పలు పోసి, రాత్రి వేళల్లో కూలీలతో ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. పేదలు అధికారుల వద్దకు వెళ్లి ఇంటి నిర్మాణానికి ఇసుక కావాలని అభ్యర్థిస్తే మాత్రం అనుమతులు లేవని వెళ్లగొడుతున్నారు. దళారులు, నాయకులు వెళితే ఎలాంటి మాటలు మాట్లాడడం లేదు. ఏడాది కాలంగా వాగు పరీవాహక గ్రామాల్లోని ఇండ్ల నిర్మాణాలకు పరిమితమైన ఇసుక రవాణా రెండు, మూడు నెలల వ్యవధిలో భారీగా జరుగుతున్నది. పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణాపై జరుగుతున్నా ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదు. వారు అడ్డుకోకుంటే వాగు నిర్జీవంగా మారుతుందని, వాగుపై ఆధారపడి వ్యవసాయ చేస్తున్న వారికి కన్నీళ్లు మిగులుతాయని రైతులు వాపోతున్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు

గూజిరి తండా వద్ద గౌతాపూర్ ప్రధాన రోడ్డు పక్కన లీకేజ్ అవుతున్న భగీరథ నీరు

చిలిపిచెడ్, డిసెంబర్ 18: మండలంలోని గూజిరి తండా వద్ద గౌతాపూర్ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని కొన్ని గ్రామాలు, తండాల్లో ప్రజలు తాగు నీటికి తండ్లాడుతుంటే, ఈ గ్రామాల్లో ఇలా నీరు వృథాగా పోతున్నది. ఇందులో గూజిరి తండా వద్ద ప్రధాన రోడ్డు పక్కన నిత్యం అధికారుల తిరిగే రోడ్డు పక్కన మిషన్ భగీరథ నీరు వృథాగా ప్రవహిస్తున్నది. నిత్యం అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహిస్తున్నారు. ఇప్పటికైన స్పందించి నీటి వృథాను ఆర్థికట్టాలని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చూస్తున్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు

అవార్డులు అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

మెదక్ అర్బన్, డిసెంబర్ 18: మెదక్ ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రగతి చక్ర పురస్కార అవార్డును డీఎం సురేఖ అందజేసినట్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు వివిధ కేటగిరిలో 39 మందికి క్యాష్ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

విద్యార్థులకు తపస్ ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న మంగ నర్సింలు

పాపన్నపేట, డిసెంబర్ 18: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించనున్న నేషనల్ బాలరంగ్ ఫెస్టివల్ పోగ్రాంకు హాజరవుతున్న పాపన్నపేట విద్యార్థులకు విద్యావేత్త మామిడి సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మంగ నర్సింలు ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కేవల్ కిషన్ జాతర పోస్టర్ విడుదల

జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేగుంట, డిసెంబర్ 18: పోలంపల్లి చౌరస్తాలో ఏటా నిర్వహించే కేవల్ కిషన్ జాతరను విజయవంతం చేయాలని జిల్లా కేవల్ కిషన్ వర్ధంతి మహోత్సవ కమిటీ చైర్మన్ కేవల్ నందకిశోర్ ముదిరాజ్, జేఏసీ నాయకుడు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్ పేర్కొన్నారు. చేగుంట మండలం పోలంపల్లి చౌరస్తా వద్ద ఈనెల 26న నిర్వహించే కేవల్ కిషన్ 64వ వర్ధంతి సందర్భంగా జాతరలో ఎడ్ల బండ్ల ఊరేగింపు కార్యక్రమంలో చేగుంట మండలంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తలారి భిక్షపతి, బెదరబోయిన నాగభూషణం, గడ్డ మీది రఘుపతి, రామస్వామి మహేశ్, శ్రీనివాస్, బోయిని నరిసింహులు, తీగుల్ల అంజనేయులు, గణేశ్, రవికుమార్ ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



వెంకటేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న కానిస్టేబుళ్లు

మెదక్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): 2007 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ పూసల వెంకటేశ్ ఈ నెల 8న గజ్వేల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సిద్దిపేట్ జిల్లా గాడిచర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్ ప్రస్తుతం దౌల్తాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం వెంకటేశ్ దశదినకర్మకు ఉమ్మడి మెదక్ జిల్లా 2007వ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లతో పాటు పోలీస్ ట్రైనింగ్ కల్యాణి డాంతిరుపతికి చెందిన వారంతా కలిసి బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు అందజేశారు. ఎ.నర్సింలు, సుధాకర్‌రావు, కృష్ణాగౌడ్, మహిపాల్, రెడ్యా నాయక్, నాగరాజు యాదగిరి, మహేశ్, వెంకటేశ్, రమేశ్, కృష్ణ, వినయ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, BALIJEGUDEM NAGESH, S/o. Balijegudem Narsimulu, R/o. H.No. 4-57/1, Gollapalle (V), Kondapur (M), Sangareddy Dist., T.S. In My Aadhar Card My Name called as BALIJEGUDEM NAGESH. In My Passport My Name as BALJAGUDEM NAGESH. Both Names BALIJEGUDEM NAGESH & BALJAGUDEM NAGESH are belongs to one and the same person.
NT-334961

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

నిజాంపేట, డిసెంబర్ 18: ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని సంగారెడ్డి ఎన్‌ఫోర్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం నిజాంపేటలోని ఎల్లమ్మ తల్లి వైన్స్‌ను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోజు రోజు స్టాక్ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. నౌకరి నామా రికార్డులను పరిశీలించారు. ఎస్సై అనిల్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

కామన్ డైట్ మెనూను పక్కాగా అమలుచేయాలి

- దివ్యాంగులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు
- 9 మంది అనుభవజ్ఞులైన వైద్యాధికారులతో ఉచిత వైద్య పరీక్షలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): విద్యార్థులకు కామన్ డైట్ మెనూను పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం మెదక్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజ్ (బాలికలు), తెలంగాణ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో అందిస్తున్న వసతులు, ఆహార మెనూ, వంట గది, స్టోర్ రూం, డైనింగ్ హాళ్లు, విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి భోజన నాణ్యతపై ఫీడ్ బ్యాక్ తీసుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా పక్కాగా మెనూ అమలు చేయాలన్నారు. ఇటీవల ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకటే కామన్ డైట్ అమలు చేస్తున్న దన్నారు. రోజు వారి అందించే డైట్ వివరాల ఫ్లెక్సీని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనవని తెలిపారు. వసతులు, భోజన నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు. ఏదైనా లోపం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రేపు దివ్యాంగులకు వైద్య శిబిరం

దివ్యాంగుల కోసం ఈ నెల 20న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి దివ్యాంగుల వైద్య శిబిరం ఏర్పాటుపై ఆయన మాట్లాడారు. దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని చెప్పామని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, డీఆర్‌డీవో, డీడబ్ల్యూవో అధికారుల సమన్వయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దివ్యాంగుల ఆరోగ్య పరిరక్షణపై పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెదక్ జిల్లా దవాఖానలో ఉచిత వైద్య శిబిరంలో ఈశ్వర్ దాస్ (జనరల్ సర్జన్), సురేందర్ (ఆర్థోపెడిక్,), పావని (స్త్రీ వైద్యనిపుణురాలు), డి.కిరణ్ (ఈఎన్‌టీ), డాక్టర్ రాజేశ్ (ఆప్తమాలజిస్ట్,), డాక్టర్ గ్రేస్ (ఫిజియోథెరపిస్ట్), డాక్టర్ ప్రదీప్ (మానసిక వైద్య నిపుణులు), మాధవి (డెంటల్ సర్జన్,), డాక్టర్ కరుణాకర్ (ఫిజియోథెరపిస్ట్, ఊపిరితిత్తులు శ్వాసకోస వ్యాధి నిపుణులు) నిష్ణాతులైన వైద్యులతో చికిత్సలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గ్రామీణ స్థాయిలో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను వెలికితీసి క్రీడలు నిర్వహిస్తున్నారని, క్రీడలతో విద్యార్థుల్లో సమైకృత, స్నేహభావం పెరుగుతుందని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ముగింపు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో పురుషులు, మహిళల విభాగంలో ఖోఖో నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు. జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు మాట్లాడుతూ జిల్లా స్థాయి క్రీడల్లో పురుషుల విభాగంలో 19 జట్లు, మహిళల విభాగంలో 16 జట్లు పాల్గొన్నాయన్నారు. పురుషుల విభాగంలో శివ్వంపేట జట్టు, మహిళల విభాగంలో నర్సాపూర్ రూరల్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో పీడీలు శ్రీనివాస రావు, మాధవ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వివిధ మండలాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలి

గెలుపొందిన విజేతలతో డీఈవో రాధాకిషన్ తదితరులు

మెదక్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని, విజ్ఞాన శాస్త్రం, జీవశాస్త్రంపై అత్యధిక శ్రద్ధ కనబర్చాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. బుధవారం మెదక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ బయోసైన్స్ ఫోరం (TBSF) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవశాస్త్ర అంశాలను జీవితంలో అన్వయించుకుని, సుస్థిర అభివృద్ధిలో భాగస్వామ్యులై ప్రగతికి తోడ్పడాలన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి మన జీవితాలను నూతన ఆవిష్కరణల వైపునకు ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతల వివరాలను డీఈవో, డీఎస్‌వో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో బయోసైన్స్ ఫోరం అధ్యక్షుడు దొంతి ప్రసన్నకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు నరేందర్, జిల్లా ఏఎమ్‌వో సుదర్శన మూర్తి, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి, సీఎంవో సతీశ్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి రమణకుమార్, జిల్లా కమిటీ సభ్యులు అరుణ, అశోక్ కుమార్, చంద్రశేఖర్, శ్రవణ్, మాధురిక, ఉమామహేశ్వర్, రాష్ట్ర బాధ్యులు లింగ ప్రసాద్, మల్లేశం పాల్గొన్నారు.

విజేతల వివరాలు

జిల్లాస్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయబడ్డ విద్యార్థులు. తెలుగు మీడియం విభాగంలో ప్రథమ స్థానం హారిక, ద్వితీయ స్థానం భానుప్రియ (జడ్పీహెచ్ఎస్ ఇస్లాంపూర్,) ఇంగ్లిష్ మీడియం విభాగంలో ప్రథమ స్థానం నందిని, (TSMS రేగోడ్), ద్వితీయ స్థానం సిద్ర తస్నీమ్, (GGHS -మెదక్) నిలిచి రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు.

దుప్పట్ల పంపిణీ

చిన్నశంకరంపేట, డిసెంబర్ 18: మండలంలోని చందంపేట గ్రామానికి చెందిన ఎర్రమల్లి నాగరాజు పద్మ దంపతుల సౌజన్యంతో 15 మంది పారిశుధ్య కార్మికులకు బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



పెద్దగొట్టిముక్లలో ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

శివ్వంపేట, డిసెంబర్ 18: మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందిన మస్కురి రవి కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు రూ.25వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. రవి చిన్ననాటి మిత్రులు శ్రీశైలం, నగేశ్, నర్సింగరావు, ఐలయ్య, కృష్ణ, మహేశ్, ఆంజనేయులు, శ్రీధర్, శ్రీనివాస్, మహేశ్ సాయం అందించారు.

వివాహానికి రూ.10వేల సాయం

కొత్తపేటలో పుల్లెర శివయ్య-మైసమ్మల కుమార్తె వివాహానికి శివ్వంపేట మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయనతో రిటైర్డ్ టీచర్ నర్సింహారెడ్డి, సుండు అశోక్, ప్రభాకర్ ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, డిసెంబర్ 18: మతిస్థిమితం లేని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏడుపాయల సమీపంలోని మంజీరా నది ఒడ్డున బుధవారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా బిలాల్‌పూర్‌కు చెందిన బలుపాటి ఆనంద్(33) కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొన్నిరోజుల నుంచి మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 15న ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. ఏడుపాయల ఆలయ సమీపంలో మంజీరా ఒడ్డున చెట్టుకు ఉరేసుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని ఆనవాళ్లను బట్టి మృతి చెందింది ఆనంద్‌గా గుర్తించారు. పోస్టుమార్టం కోసం జిల్లా ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాయీబ్రాహ్మణ సంఘ స్థలం కబ్జాను అరికట్టండి

నిజాంపేట, డిసెంబర్ 18: కల్వకుంటలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం స్థల కబ్జాను అరికట్టాలని, ఆ సంఘం సభ్యులు బుధవారం ఎంపీడీవో రాజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు మాట్లాడుతూ 9 గుంటల మేర ఉన్నా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకుని ఇంటిని నిర్మిస్తున్నాడన్నారు. ఇంటి నిర్మాణాన్ని ఆపేసి తమకు న్యాయం చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశామన్నారు. సంఘం సభ్యులు రమేశ్, లక్ష్మణ్, నర్సింహులు, పాండు, సతీశ్, యాదగిరి, రామ్, సంతోష్, లక్ష్మి, తిరుపతి, వెంకటలక్ష్మి ఉన్నారు.

నిబంధనల మేరకు సాగు చేయాలి

టేక్మాల్, డిసెంబర్ 18: ప్రభుత్వ నిబంధనల మేరకు యాసంగి పంటలు సాగు చేయాలని తహసీల్దార్ తులసీరాం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం టేక్మాల్ పెద్ద చెరువు, చిన్న చెరువు ఆయకట్టులో తైబందీ హద్దులను నిర్ణయించారు. ఈ యాసంగిలో చెరువుల కింద 200ఎకరాల్లో వరిని సాగు చేయాలని సూచించారు. పరిధి దాటి పంట వేస్తే నీళ్ల సరిపోవని, దీంతో పంట నష్టం జరుగుతుందన్నారు. ఈ నిబంధనల మేరకు రైతులు పంట సాగు చేయాలన్నారు.

ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం: ఎస్పీ

మెదక్ అర్బన్, డిసెంబర్ 18: ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు క్యూఆర్ టీం పార్టీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని సామాన్యుడిని దృష్టిలో పెట్టుకుని వారికి భరోసా కల్పించేలా పోలీసింగ్ ఉంటుందన్నారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉంటామన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణ, అదుపునకు నేరాల గుర్తింపు శాంతి భద్రతల సంరక్షణకు ప్రతిఒక్కరి సహకారం అవసరమన్నారు. పోలీసులు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇందుకు జిల్లాలో నాలుగు క్యూఆర్ టీంలు కేటాయించామన్నారు. జిల్లాలో ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు సంభవిస్తే వెంటనే స్పందించేందుకు క్యూఆర్‌టీం బృందాలు పనిచేస్తాయని పేర్కొన్నారు.

వీఎస్టీ పరిశ్రమలో ఎన్నికల సందడి

మనోహరాబాద్, డిసెంబర్ 18: మెద క్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్ పరిధి వీఎస్టీ పరిశ్రమలో ఎన్నికల హడావిడి మొదలైంది. పరిశ్రమలో మొత్తం 386 మంది కార్మికులు ఉండగా ఈ నెల 28వతేదీన యూనియన్ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్ఎన్‌రెడ్డి గ్రూపు తరపున బుధవారం యూనియన్ గ్రూప్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి కార్మికులతో కలిసి సంగారెడ్డిలో నామినేషన్ వేశారు.

మీసేవలో కొత్త సర్వీసులు: ఈడీఎం



నామినేషన్ వేస్తున్న ఎన్ఎన్‌రెడ్డి గ్రూప్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి

రేగోడ్, డిసెంబర్ 18: కొత్త సర్వీసులను వినియోగించుకోవాలని జిల్లా ఈ డిస్ట్రిక్ మేనేజర్ సందీప్ ప్రకటనలో బుధవారం తెలిపారు. నూతనంగా గ్యాప్ సర్టిఫికెట్, పేరు మార్పు, లోకల్, మైనార్టీ, రిస్క్యూ ఆఫ్, క్రిమిలేయర్, నాన్ క్రిమిలేయర్, సీనియర్ సిటిజన్ మెంటెనెన్స్, కాంప్రహెన్సిస్ ఫర్ హ్యూమన్ కిల్స్, కిల్లుడ్ బై వైల్డ్ ఎనిమల్స్, సామిల్/ టింబర్ డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన సర్టిఫికెట్లను ఇక నుంచి మీసేవలోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో ఆయా శాఖల్లో మాన్యువల్‌గా ఆఫీసుల చుట్టూ తిరిగి తీసుకునేవారని, ఇక నుంచి మీసేవలో తెలంగాణలో ఎక్కడ నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

బాలకార్మిక రహిత సమాజానికి కృషి

నిజాంపేట, డిసెంబర్18: బాలకార్మిక రహిత సమాజానికి కృషి చేయాలని రాంపూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మారెడ్డి అన్నారు. బుధవారం రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'విజన్ ఏ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాలు, బాల్యకార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి హెచ్ఎం అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ యాదగిరి, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేశ్, చంద్రకాంత్, కుమారస్వామి, షాదుల్, విద్యార్థులు ఉన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జరగాలి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, డిసెంబర్ 18: వార్డు అధికారుల ద్వారా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపాలిటీలో చైర్మన్ అధ్యక్షతన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలన్నారు. వార్డు అధికారులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, జూనియర్ సహాయకులు శ్రీనివాసరావు, బాబు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ పాల్గొన్నారు.

ఏడుపాయలకు రూ.2.38 కోట్ల ఆదాయం

పాపన్నపేట, డిసెంబర్ 18: ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి, దేవాదాయ శాఖ నిర్వహించిన సీల్, ఓపెన్ టెండర్ల ద్వారా రూ.2 కోట్ల 38 లక్షల 80 వేల ఆదాయం సమకూరినట్లు అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ ఈవో కార్యాలయంలో కొబ్బరికాయలు, ఒడిబియ్యం, పూజ సామగ్రి విక్రయాల వేలం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 8 మంది పాల్గొనగా, రూ.కోటి 11 లక్షల 20 వేలలకు కొబ్బరికాయల విక్రయాన్ని లింగోజి దక్కించుకున్నారు. ప్రోగు చేసుకునే హక్కును నాగ్‌సాన్‌పల్లికి చెందిన జీవన్‌రెడ్డి రూ.1 కోటి 9లక్షల 50వేలకు, పూజ సామగ్రిని బుడాల నర్సింలు రూ.17 లక్షలకు దక్కించుకున్నారు. సిబ్బంది శ్యామ్, శ్రీనివాస్‌శర్మ, ప్రతాప్‌రెడ్డి, యాదగిరి, నర్సింలు, మహేశ్ పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

మెదక్‌రూరల్, డిసెంబర్18: మండలంలోని మంబోజిపల్లి శివారు పసుపు లేటి బ్రిడ్జి